# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-11-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు కర్ణాటక రాష్ట్ర న్యాయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది.**

2. **తెలంగాణలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఫిల్మ్ సిటీని ఏర్పాటు చేయనున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు.**

3. **ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో పెట్టుబడులకు అనుకూలమని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.**

4. **మొంథా తుపాను కారణంగా జరిగిన పంటనష్టం నమోదుకు గడువు పొడిగించామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.**

5. **విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచేందుకు ఎడ్యుకేషన్ టూర్‌లు దోహదపడతాయని ఆంధ్రప్రదేశ్ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు.**

=========================

ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు కర్ణాటక రాష్ట్ర న్యాయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. కర్ణాటకలోని ధార్వాడ్‌లో నిర్వహించిన విశ్వవిద్యాలయం ఏడో స్నాతకోత్సవంలో ఛాన్సలర్, ఆ రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ గౌరవ డాక్టరేట్‌ను గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు నిన్న ప్రదానం చేసి సత్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ, గౌరవ డాక్టరేట్‌ను ఇచ్చినందుకు కర్ణాటక న్యాయ విశ్వవిద్యాలయానికి ధన్యవాదాలు తెలిపారు.

-------------------------

తెలంగాణలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఫిల్మ్ సిటీని ఏర్పాటు చేయానున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచార కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ లోని తెలుగు ఫిలిం క్లబ్‌లో సినీ రంగ ప్రముఖుల సమావేశంలో ఆయన నిన్న పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సినీ పరిశ్రమ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. 'మా' అసోసియేషన్ కార్యాలయ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగం పెట్టుబడులకు అనుకూలమని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. లండన్‌లో జరుగుతున్న వరల్డ్ ట్రావెల్ మార్కెట్ –డబ్ల్యూటీఎం–2025లో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం –పీపీపీ విధానంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టే వారికి ఏక గవాక్ష విధానంలో అనుమతులు జారీ చేస్తామన్నారు. ఈనెల 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే భాగస్వామ్య సదస్సుకు హాజరుకావాలని కోరారు.

----------------------------

మొంథా తుఫాను కారణంగా జరిగిన పంటనష్టం నమోదుకు గడువు పొడిగించామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. శ్రీకాకుళంలో జరిగిన జిల్లా సమీక్ష మండలి సమావేశంలో మంత్రి నిన్న  పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో వందశాతం ఈ–క్రాప్ నమోదు జరిగిందని, తుఫాను ప్రభావంతో నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందిస్తామని చెప్పారు. పంటనష్టం నమోదుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశామని మంత్రి తెలిపారు.

----------------------------

విద్యార్థుల్లో సృజనాత్మకత, సరికొత్త ఆవిష్కరణల ఆలోచన విధానాలను పెంచేందుకు ఎడ్యుకేషన్ టూర్ లు దోహదపడతాయని ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి తెలిపారు. "ఢిల్లీ విజ్ఞాన పర్యటన" కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికైన విద్యార్థులను విజయవాడ నుంచి దృశ్య మాధ్యమ విధానం ద్వారా మంత్రి నిన్న అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి జనార్థన్ రెడ్డి మాట్లాడుతూ, ఏపీ సైన్స్ సిటీ, సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో జిల్లాకు ఇద్దరు చొప్పున 52 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఈ కార్యక్రమానికి ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రేపటి నుంచి 8వ తేదీ వరకు జరిగే ఈ పర్యటనలో నేషనల్ సైన్స్ మ్యూజియం, నెహ్రూ ప్లానిటోరియం వంటి ప్రాంతాల సందర్శన ద్వారా విద్యార్థుల్లో సైన్స్, టెక్నాలజీల అంశాలపై మరింత అవగాహన పెరుగుతుందని తెలిపారు.

----------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ప్రధానమంత్రి జన్ వికాస్ కార్యక్రమం –పీఎంజేవీకే ద్వారా మైనారిటీల  సంక్షేమ, అభివృద్ధి పనుల కోసం  203.69 కోట్ల రూపాయలను  ప్రభుత్వం విడుదల చేసిందని  న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్  ఒక ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్రంలో మైనారిటీల వికాసానికి "జన్ వికాస్" ద్వారా విస్తృత మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర బడ్జెట్ 2025–2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మైనారిటీ సంక్షేమం కోసం పీఎంజేవీకే కింద రూపొందించిన పనులు, అభివృద్ధి ప్రణాళిక, ఆర్థిక తోడ్పాటు, వంటి కార్యక్రమాల అమలుకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని మంత్రి పేర్కొన్నారు.

----------------------------

యువతకి  సంస్కృతి సంప్రదాయాలతో పాటు నైతిక విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల పార్లమెంటు సభ్యురాలు బైరెడ్డి శబరి సూచించారు. నంద్యాల పట్టణంలోని స్థానిక కళాశాలలో నిర్వహించిన యువజనోత్సవంలో ఆమె నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,

వాయిస్ 30 సెకన్లు

--------------------------

"మహిళాశక్తి పథకం" ద్వారా తెలంగాణలో మహిళా సంఘాలకు ఆర్థిక సాధికారత కల్పిస్తున్నామని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. 'ప్రతికూలతల నుంచి మహిళా సాధికారత వైపు' అనే అంశంపై నెదర్లాండ్స్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా నాయకత్వ సదస్సులో ఆమె నిన్న పాల్గొని ప్రసంగించారు. ఇందిరా మహిళాశక్తి పథకం ద్వారా మహిళా సంఘాలు, ఆర్థికంగా స్వయంసమృద్ధి సాధించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

--------------------------

తిరుపతిలోని రేణిగుంట విమానాశ్రయం పేరును శ్రీ వేంకటేశ్వర అంతర్జాతీయ విమానాశ్రయంగా మార్చే ప్రతిపాదనను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రానికి పంపనుందని టిటిడి ఛైర్మెన్ బీఆర్ నాయుడు పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి బాధ్యతలు చేపట్టి సంవత్సరం పూర్తయిన సందర్భంగా బోర్డు సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ...

వాయిస్ 27 సెకన్లు

--------------------------

స్వాతంత్ర్య సమరంలో ఉద్యమకారులకు స్ఫూర్తి నిచ్చిన గీతం "వందేమాతరం" రచించి రేపటితో 150 సంవత్సరాలు పూర్తవుతోంది. ఈ గీతాన్ని బంకించంద్ర ఛటర్జీ 1875 నవంబర్ ఏడవ తేదీన రచించారు. ఈ చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా వేడుకలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ వేడుకలలో భాగంగా రేపు ఉదయం పది గంటలకు ప్రజలంతా వందేమాతరం గీతం ఆలపించాలని సూచించింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచిస్తూ అన్ని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వందేమాతర గీతాలాపన కార్యక్రమంలో పౌరులు, విద్యార్థులు, అధికారులు, ప్రజా ప్రతినిధులతో పాటు అన్ని వర్గాల వారు పాల్గొనాలని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.

--------------------------

నైరుతి బంగాళాఖాతం నుండి తమిళనాడు మీదుగా ద్రోణి కొనసాగుతోందని, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 0.9 కిలో మీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని పలు జిల్లాలలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎం. వెంకట్రావ్ తెలియజేస్తూ,

వాయిస్..25 సెకన్లు

తెలంగాణలోనూ రానున్న రెండు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

====================